**గేట్వే బైబిల్ అకాడమీ 22 ఏప్రిల్ 2015**

**6వ వారం - క్రైస్తవ నాయకత్వం - 'దైవిక స్వభావం' (రెండవ భాగం)**

**పరిచయం**: ఇంతకుముందు పాఠ్యభాగంలో నమ్మకత్వం యొక్క ప్రాముఖ్యతను మనం చూసాము. నమ్మకత్వమనేది అనేక వ్యత్యాసమైన విధానాలలో వ్యక్తీకరింపబడుతుంది. అందులో - క్రీస్తును పోలిన వైఖరి, నిజాయితీ మరియు నమ్మకత్వాలను మనం చర్చించుకున్నాము. క్రైస్తవ నాయకత్వానికి ఇవే ముఖ్యమైన మూలాధారాలు. అత్యంత సమర్ధవంతమైన వ్యక్తి అయినా సరే నమ్మలేని వ్యక్తిని ఎవరైనా వెంబడించాలి అని అనుకుంటారా లేక నాయకత్వంలో అన్ని వర్గాల్లో సమర్ధత చూపలేకపోయినా, పూర్తిగా నమ్మగలిగిన వ్యక్తిని ఎవరైనా వెంబడిస్తారా? అలాగే గత పాఠ్యభాగంలో, క్రైస్తవ నాయకుడు తనయొక్క బలహీనతలు గుర్తించి, తనయొక్క అయోగ్యతను దేవునికి అర్పించుటలోనే తన యొక్క బలం దాగి ఉంది అని కూడా మనం చర్చించుకున్నాము. అప్పుడే దేవుని శక్తి ఆ దీనత్వంలోనే పనిచేయడం ప్రారంభమవుతుంది.

'దైవిక స్వభావం' లోని ఇతర అంశాలను పరిగణించే ముందు, 'తేజస్సు లేక ఆకర్షణ' ను గురించిన ప్రశ్నకు జవాబును చూడటం ఇక్కడ అవసరమైనది. 'తేజస్సు లేక ఆకర్షణ' ను గురించి లోకానుసారమైన వివరణ ఈ విధంగా వుంది 'తేజస్సు అనగా వ్యక్తిత్వంలోని శక్తి ద్వారా వచ్చిన సహజమైన సామర్ధ్యంతో ఇతరులలో అత్యుత్సాహాన్ని మరియు అభిమానాన్ని స్ఫూర్తింపజేసేది'. వారి నిజమైన స్వభావాన్ని, అసత్య తేజస్సు కోసం రాజీపడకుండా ఉండేలా ప్రతీ క్రైస్తవ నాయకుడు జాగ్రత్తపడటం చాలా ముఖ్యమైనది. బయటకు చూపించే ప్రవర్తనతో ఈ తేజస్సు ముడిపడి ఉంది - ఎలాగంటే - ఆత్మ విశ్వాసాన్ని చిత్రీకరించే ప్రయత్నం చేయడం, మాటతీరు చేత ఇతరులను ఒప్పించే ప్రయత్నం చేయడం లాంటివి. ఇది ఆకర్షించే తేజస్సు లేక నివేదిక చేత గారడీ చేయడం లాంటిది. సహజంగా వచ్చిన తేజస్సు ఒక స్థాయి వరుకు ఉండటంలో తప్పులేదు, ఆ స్థాయి దాటినప్పుడే నీకు మరియు ఇతరులకు అది హాని కలుగజేస్తుంది. ఎందుకు? క్రైస్తవ నాయకత్వంలో ఒకవేళ నీవు నీవుగా లేక సహజంగా పనిచేయకపోతే, వెంటనే అయినా లేక కొంతకాలం తరువాత అయినా సరే నీవు ఒక ప్రదర్శించే వ్యక్తిగానే పరిగణించబడతావు. ఎందుకంటే అది నీ సహజమైన స్వభావం కాదు కాబట్టి.

అయినప్పటికీ ఈ తేజస్సును పరిశుద్ధ గ్రంథంలో చెప్పబడిన ప్రకారం సాధన చేద్దాం. 'తేజస్సు లేక ఆకర్షణ' అనే పదం ద్వారా 'ప్రజాకర్షణ కలిగిన' అనే గ్రీకు పదం (Charisma) నుంచి ఉద్భవించింది. 'తేజస్సు లేక ఆకర్షణ' అనగా పరిశుద్ధాత్మ వరం. కనుక, పరిశుద్ధాత్మ చే ఇవ్వబడిన ఆత్మీయ వరాలను ప్రతీ క్రైస్తవుడు సాధన చేయాలి. అవి నిజమైనవి మరియు దైవిక స్వభావానికి దగ్గరగా ఉంచి, క్రీస్తు పోలికలోనికి తెచ్చే ప్రయత్నం చేసేవి. పరిశుద్ధాత్మ వారాల్లో నాయకత్వం ఒకటి (రోమీయులకు 12:8).

**పరిశుద్ధత లోని అంశాలు:**

'ఎవ్వరు చూడనప్పుడు నీవెవరివో? అదే నీ దైవిక స్వభావం (Bill Hybels ). ఇంకా ముందుకెళ్తే, మూసివున్న తలుపులు వెనుక ఏకాంతంలో మాత్రమే నీ స్వభావం బయలుపడదు గాని, అది రోజు వారి పనుల్లో మరిముఖ్యంగా ఒత్తిడిలల్లో ఉన్నప్పుడు కూడా బయలుపడుతుంది. దేవుడు మనలను పరిశుద్ధంగా ఉండుటకు పిలుచుకున్నారు, అది మన జీవితాలలోని అన్ని అంశాలలో విస్తరించి ఉండాలి. పరిశుద్ధ గ్రంధం ఈ విధంగా చెబుతుంది ' మిమ్మును పిలిచిన వాడు పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి' (1 పేతురు 1:15-16)

Ajith Fernando వ్రాస్తూ 'పరిశుద్ధత అనేది నాయకత్వం యొక్క స్పష్టమైన ప్రధాన అర్హత అయ్యి ఉన్నది ' అని వివరించెను. ఒక నాయకునిలో ఏమి చూడాలి అనే దాని గురించి అపోస్తులుడైన పౌలు తిమోతికి డజను కంటే ఎక్కువ లక్షణాలను వ్రాసెను. ఈ వాక్యభాగం సంఘకాపరులను ఉద్దేశించినదైనా, ఇందులోని సిద్ధాంతాలను తీసుకొని, క్రైస్తవ నాయకత్వంలోని అన్ని పాత్రలకు అవలంభించవచ్చు.

"అధ్యక్షుడగువాడు నిందారహితుడును, ఏకపత్నీ పురుషు డును, మితానుభవుడును, స్వస్థబుద్ధిగలవాడును, మర్యా దస్థుడును, అతిథిప్రియుడును, బోధింపతగినవాడునై యుండి,మద్యపానియు కొట్టువాడునుకాక, సాత్వి కుడును, జగడమాడనివాడును, ధనాపేక్షలేనివాడునై, సంపూర్ణమాన్యత కలిగి తన పిల్లలను స్వాధీనపరచుకొనుచు, తన యింటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను. ఎవడైనను తన యింటివారిని ఏలనేరక పోయినయెడల అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును? అతడు గర్వాంధుడై అపవాదికి కలిగిన శిక్షావిధికి లోబడకుండునట్లు క్రొత్తగా చేరినవాడై యుండకూడదు. మరియు అతడు నిందపాలై అపవాది ఉరిలో పడిపోకుండునట్లు సంఘమునకు వెలుపటివారిచేత మంచి సాక్ష్యము పొందిన వాడైయుండవలెను". 1తిమోతికి 3:2-7

కొన్ని స్పష్టం చేసేముందు, కొన్ని అభిప్రాయాలను చర్చించుకుందాం. మొట్టమొదటిగా, ఈ పట్టికలో చెప్పుకోదగిన విశేషం ఏముంది? ఇది ప్రత్యేకమైనది, ఎందుకంటే అతి సాధారణమైనది కాబట్టి.. ఇంకోమాటల్లో చెప్పాలంటే ఈ అర్హతలు కేవలం నాయకత్వంలో ఉన్నవారికి మాత్రమే పరిమితం కాదు గాని , ప్రతీ క్రైస్తవుడు చూపించాల్సినవి. వీటిలో చాలవరుకు , సర్వసాధారణమైనవి. అందులో ఏదైనా ఒకటి నీ కవచం లో పగులు వంటిది..దాని ద్వారా సాతాను యొక్క దాడికి లోనయ్యే బలహీనత కలుగవచ్చు.

ఏ విషయములో నీవు ఎక్కువ పోరాడుతున్నావు? కపటము లేక మోహం లేక రౌడీ ప్రవర్తన లేక నిర్దయ లేక త్రాగుబోతుతనం లేక కొట్లాటలు లేక నిత్యం జగడమాడేతత్వం లేక డబ్బుపై ప్రేమ నీ బలహీనతలు కావచ్చు. అది ఏదైనా సరే దేవుని దగ్గరకు దానిని ఎల్లప్పుడూ తీసుకొస్తూ, ఆయన సహాయం కోరాలి. క్రైస్తవులుగా మనకు పరిశుదాత్మ సహాయం ఉన్నది కాబట్టి, మనకు సాకులు చెప్పే అవకాశం లేదు. ఆయన యొక్క అసాధారణమైన శక్తి మనలోనే నివసిస్తూ ఉంది. రెండవదిగా, సామర్ధ్యాలతో కూడిన అర్హతలు ఎన్ని కావాలి? కేవలం ఒక్కటే 'భోదించగలగటం' (2వ వచనం). మిగతా గుణాలన్నీ, కీర్తి, స్వభావం, కుటుంబ జీవితం మరియు పరిపక్వతకు సంభందించినవి. ఈ అన్ని లక్షణాలు, పరిశుద్ధతకు సంభందించినది.

కొన్ని స్పష్టీకరణలు. రెండవ వచనంలో, అపోస్తులుడైన పౌలు, ఆ రోజుల్లో ఉన్న ప్రముఖమైన బహుభార్యత్వం గురించి సూచిస్తూ ఉండవచ్చు. కాని ఈ రోజు ఆ సూత్రాన్ని తీసుకొని నమ్మకమైన వివాహానికి మనం వర్తించవచ్చు. నాకు తెలిసిన ఒక క్రైస్తవుడు, తానూ క్రైస్తవుడు అయినప్పటి నుండి మూడుసార్లు విడాకులు తీసుకొని, ప్రతీసారి, తనకున్న భార్యను విడిచిపెట్టేసేవాడు. అలాంటి ఒక వ్యక్తి క్రైస్తవ నాయకత్వానికి తగినవాడా?

4,5 వచనాలలో, పిల్లలు క్రైస్తవులుగా వుండాలి అని అపోస్తులుడైన పౌలు గట్టిగా కోరుతున్నాడా? నేనైతే అలా అనుకోవట్లేదు. అలాకాకుండా, తల్లిదండ్రులే పిల్లలు క్రమశిక్షణ తో సరైన విధానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఉదాహరణకు: ఒక యవ్వనస్థుడు జూదం ఆడుతుంటే , ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, ఒక క్రైస్తవ తల్లి తండ్రులుగా (క్రైస్తవ నాయకత్వంలో కూడా వున్న) దీన్ని ఎలా సంభాళించాలి? ఒకవేళ ఆ తల్లిదండ్రులు, ఈ విషయాన్ని పట్టించుకోకుండా, నిర్లక్ష్యం చేస్తే, అలాంటి వ్యక్తి నాయకత్వంలో ఉండుటకు అయోగ్యులు అని అపోస్తులుడైన పౌలు చెబుతున్నాడు.

6 వ వచనంలో, నూతన క్రైస్తవులు త్వరగా నాయకత్వపు పాత్రలోనికి బలవంతంగా నెట్టివేయబడడం అనే హెచ్చరిక గురించి చూస్తాం. నూతన సంఘంలో నూతన విశ్వాసులు, యేసుక్రీస్తు నందు విశ్వాసం లోనికి వచ్చిన 12 నెలలుకే నాయకులుగా మారే అవకాశం ఉండొచ్చు. కాని 6 వ వచనం ప్రకారం సాధారణంగా క్రైస్తవ నాయకులు అంటే వారి విశ్వాసంలో పరిపక్వత చెందినవారు. నూతన నిభందనలో ఎందుకు సంఘనాయకులను ఉదాహరణకు కాపరులను , పెద్దలు అని పిలిచారు? ఎందుకంటే వారు కొంచెం వయస్సులో, ఆత్మీయ విశ్వాసంలో పరిణితి చెందినవారు.

**ప్రమాణాలను ఏర్పాటు చేయుట:**

అపోస్తులుడైన పౌలు, తీతుకు అనే ఇంకొక నాయకునికి, తానూ ఒక మాదిరిని చూపాలని ఆదేశించాడు. "...అన్నిటియందు నిన్ను నీవే సత్కార్యములవిషయమై మాదిరిగా కనుపరచుకొనుము. నీ ఉపదేశము మోసములేనిదిగాను మాన్య మైనదిగాను నిరాక్షేపమైన హితవాక్యముతో కూడినదిగాను ఉండవలెను" (తీతుకు 2:7-8). 1 కొరింథీయులకు 11:1, ఫిలిప్పీయులకు 3:17, మరియు 2 థెస్సలొనీకయులకు 3:7 లలో వివిధ సంఘాలకు వ్రాస్తూ, తాను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకోనండి అని ప్రోత్సాహించెను.

దైవిక (లేక లౌకిక ) స్వభావం సంఘంలో ఇతరులపై లోతైన ప్రభావం చూపుతుంది, కనుక దాన్ని చిన్న చూపు చూడటం మనకే ప్రమాదకరం. క్రైస్తవ నాయకత్వంలో ఉన్న వారి జీవితాలు ఇతరులను తప్పుచేయకుండా ఆటంక పరిచేదిగా ఉండాలి. ముఖ్యంగా సంఘంలో ఇతరులు శోధింపబడినప్పుడు. ఉదా: ఆధారంలేని పుకార్లు మాట్లాడుకోవడం లేక అబద్ధాలు లేక లైంగిక పాపానికి లోబడటం లేక అపవాదు వేయడం లేక దొంగిలించడం వంటివి. ఎవరైనా అడగవచ్చు 'ఒక నాయకుడే పుకార్లు మాట్లాడితే, నేనెందుకు మాట్లాడకూడదు అని ?' లేక 'ఒక నాయకుడే మలినమైన భాష మాట్లాడినప్పుడు, నేను నిశ్చయంగా మాట్లాడవచ్చు' అని.

Ajith Fernando వ్రాస్తూ, 'ఈ రోజుల్లో అలాంటి పాపాలను సహించని ఒక వాతావరణాన్ని కలిగించడం మనకు ఒక పెద్ద సవాలు మరియు ప్రాభావిక ఉదాహరణలుగా అందరికి కనిపించేదిగా దైవిక నాయకత్వం ఉండాలి. అలాంటి ఉన్నతమైన ప్రమాణాలు దైవ భక్తి లేని వారికి ఒక సవాలు వంటిది'.

**దైవిక స్వభావంలో అభివృద్ధి చెందటం:**

ఇతరులు నిన్ను నమ్మి, అనుసరించాలి అంటే మనం చర్చించుకున్న ప్రకారం, దైవిక స్వభావం అతి ముఖ్యమైనది. క్రైస్తవ నాయకుని స్వభావమే , సంఘంలోని ఇతరుల స్వబావాన్ని నిర్దేశిస్తుంది. క్రైస్తవ నాయకుడు తన దైవిక స్వభావాన్ని ఎలా కాపాడుకుంటాడు? క్రైస్తవ నాయకుడు పరిశుద్ధతను నిరంతరం ఎలా వెదుకగలడు?

నాయకత్వంలో ఉన్న వారు మాత్రమే కాక, ప్రతీ క్రైస్తవుడు నిరంతరం చేసే అలవాటుగా చేయడానికి కొన్ని క్రమశిక్షణలు ఉన్నాయి. అందులో ప్రార్థన, పరిశుద్ధ గ్రంథ పఠనము, ఇతర క్రైస్తవులతో సహవాసం వంటివి చాలా ప్రత్యేకమైన అతి ముఖ్యమైన క్రమశిక్షణలు.

**ప్రార్థన:**

వ్యక్తిగత ప్రార్థన అనగా నీ దేవుడైన పరలోక తండ్రి దగ్గరకు నీవు నీవులా రావడం, ఒక ప్రత్యేక సమయాన్ని కేటాయించుకోవడం, సమతుల్య వ్యక్తిగత ప్రార్థనా జీవితానికి ఎంతో సహాయపడుతుంది. అనేకమందికి సహాయంగా ఉపయోగపడిన ACTS అనే కూర్పు ఈ విధంగా ఉంది.

A - ఆరాధన (Adoration )

C - ఒప్పుకోలు (Confession )

T - కృతజ్ఞతలు చెల్లించుట (Thanksgiving )

S - విన్నపము (Supplication )

ప్రార్థన అనేది ఒకేఒక నిజమైన, సజీవమైన, తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అను త్రియేక దేవుణ్ణి ఆరాధించడంతో మొదలవుతుంది. 'నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము. నా అంతరంగమునందున్న సమస్తమా, ఆయన పరిశుద్ధ నామమును సన్నుతించుము'. (కీర్తనలు 103:1). దేవుడు మన సృష్టి కర్త, విమోచకుడు కనుక , ఆయన ఆరాధనకు ఎంతైనా యోగ్యుడు.

ఆరాధన తరువాత, దేవుని సన్నిధిలో ఒప్పుకోలు చేయుటకు సిద్ధపడిరావాలి. Martin Luther ఒకసారి ఈ విధంగా చెప్పారు 'ప్రతీరోజు దేవుని యొద్ద పశ్చాతాప్పపడటమే ఈ జీవిత సారంశము'. నీ జీవితంలో చివరిసారి ఎప్పుడు దేవుని యొద్ద పశ్చాతాప్పపడ్డావో ఎప్పటికప్పుడు విచారణ చేసుకోవాలి. ఉదా: 24 గంటలు ముందు. దేవుని బాధపెట్టే ఏదైనా ఆలోచన గాని లేక పని గాని చేసేవేమో చూపించుమని అడగాలి. దేవుడు మన ఆరాధనను మాత్రమే కాదు గాని, మనం నిజంగా పశ్చాతాప్పపడినప్పుడు, మనల్ని క్షమించడం కూడా ఇష్టపడే దేవుడు. 'మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును' (1 యోహాను 1:9).

దేవుడు మన పాపాలను క్షమిస్తారు అనే వాగ్దానాన్ని బట్టి మనం ఆయన్ని ఎంతో స్తుతించాలి. ఇది క్రీస్తు యొక్క ప్రాయశ్చిత మరణం ద్వారానే సాధ్యం. కనుక పాశ్చాత్తాప్పంతో , క్రీస్తునందు విశ్వాసంతోనే దీన్ని స్వీకరించగలం. వాస్తవంగా దేవుని స్తుతించడం అనేది మన అనుదిన ప్రార్థనా జీవితంలో ఒక భాగం. ప్రార్థనలకు జవాబును పొందినప్పుడు, రోజు వారి జీవితంలో వుండే ఆశీర్వాదాలు పొందినప్పుడు అలానే దేవుని అద్భుతాలను పొందినప్పుడు దేవుని యెడల కృతజ్ఞతా భావంతో ఉండటం దేవునికి ఎంతో ఇష్టం.

చివరిగా, దేవుని యొద్ద మన విన్నపములను చెప్పుకోవాలి. 'విన్నపములు' ఒక పురాతన పదం కావచ్చు, కాని దీన మనస్సుతో దేవుని సన్నిధికి వచ్చి సహాయం అడగటమే దీని భావం. ఇది ఇతరుల కొరకు విజ్ఞాపన చేయడం లేక మన కొరకు మనం విజ్ఞాపన చేసుకోవడం వంటిది. యేసు, ఒక బీద విధవరాలు న్యాయం కోసం తన విన్నపాన్ని చెప్పుకోవడానికి అన్యాయస్తుడైన న్యాయాధిపతి వద్దకు రావడం అనే ఒక చిన్న ఉపమానాన్ని భోధించారు. ఆమె తనకు న్యాయం చేయమని మాటిమాటికి గోజాడుతునే ఉండటంతో, ఆ అన్యాయస్తుడైన న్యాయాధిపతి ఆమెకు న్యాయం తీర్చడానికి సమ్మతించెను (లూకా 18:1-8). ఈ ఉపమానం ప్రతి ఒక్కరికి ప్రోత్సాహాన్నిస్తుంది మరియు ప్రతి క్రైస్తవ నాయకుడు ఇతరులకొరకు మరియు వారి పరిస్థితుల కొరకు విడిచిపెట్టకుండా విజ్ఞాపన చేస్తూ ఉండటంలో మాదిరిని చూపించాలి. ACTS అనే కూర్పుతో పాటు, యేసు తన శిష్యులకు నేర్పిన పరలోక ప్రార్థనా మాదిరిని కూడా మనం అనుసరించడానికి సహాయపడుతుంది (మత్తయి 6:9-13)

**పరిశుద్ధ గ్రంధం**: దైవిక స్వభావంలో ఎదగడానికి, ప్రార్థనతో పాటు  పరిశుద్ధ గ్రంధం లోని దేవుని వాక్యాన్ని ధ్యానించడం కూడా చాలా ప్రాముఖ్యమైనది. 'యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచుదివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు' (కీర్తనలు 1:2). పరిశుద్ధ గ్రంధాన్ని ఒక పద్ధతిగా చదివే ప్రణాళికను ఏర్పాటు చేసుకొని దానికి కట్టుబడి ఉండటం చాలా సహాయపడుతుంది. అప్పుడు ఆ ప్రణాళిక ద్వారా పాత మరియు క్రొత్త నిభందనలు కూడా చదువుకోవచ్చు.

ప్రార్థన, పరిశుద్ధ గ్రంధ పఠనము రెండూ  నీకు , నీ పరలోక తండ్రికి మధ్య సంబంధం వంటిది. ప్రార్థనలో, కొన్ని సార్లు దేవుడు నీతో మాట్లాడుతారు. నీ మనస్సులో ఎంతో స్పష్టమైన, నీకు సంబంధించిన మరియు నీవు చేయవలసిన ఒక ఆలోచన పెట్టవచ్చు. లేక నీవు ఏమి చెయ్యాలో అనే దాని గురించి నీ మనస్సుపై ఒక బలమైన ముద్ర వేయొచ్చు. అలానే, నీ రోజు వారి పరిశుద్ధ గ్రంధంలోని పాఠ్య భాగాలను చదివినప్పుడు, దేవుడు నీతో మాట్లాడటమే కాదు, దానిలోని ప్రశ్నలను దేవునిని నీ ప్రార్థనలో అడగవచ్చు. ఉదా: ఆ వాక్యభాగం యొక్క భావం ఇంకా స్పష్టంగా తెలుసుకోవడం లేక ఆ వాక్య ప్రకారం ఎలా జీవించాలో తెలుసుకోవడం కావచ్చు. 'మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునైయుండుడి'. (యాకోబు 1:22)

ప్రార్థన మరియు పరిశుద్ధ గ్రంధ పఠనము ప్రాముఖ్యంగా దేవునితో నీ సహవాసాన్ని పోషించుకోవడానికి ఉపయోగపడుతుంది. అదే దైవిక స్వభావానికి పునాది వంటిది. ఇలాంటి ప్రతీరోజు క్రమశిక్షణలకు ప్రత్యామ్నాయాలు ఉండవు. సులువైన మార్గాలు అలానే త్వరగా పరిష్కారం పొందటం వంటివి కూడా ఉండవు. దీనికి సమయం, భక్తి మరియు శ్రద్ధ అవసరం.

**సహవాసము:**

తరుచు ఇతర క్రైస్తవులతో కలిసి సహవాసం కలిగి ఉండటం కూడా ఆత్మీయ క్రమశిక్షణకు పునాది వంటిది, అందులో సహవాస ప్రార్థన, ఆరాధన మరియు కలిసి దేవుని వాక్యం చదవటం ఉంటాయి. ఇలా ఇతర క్రైస్తవులతో సహవాసం కలిగి ఉండటం వలన దేవునితో నడవడానికి మరియు క్రీస్తును గూర్చిన దైవ సువార్తను ప్రకటించుటకు ఒకరి ద్వారా ఒకరు ప్రోత్సాహాన్ని పొందటం ఒక గొప్ప ప్రయోజనం. 'ఆ దినము సమీపించుట మీరు చూచినకొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము'.(హెబ్రీయులకు 10:25). ఇలా సహవాసంగా కలవడం వలన, ఎవరి లోపాలను వారు తెలుసుకోవచ్చు. ముఖ్యంగా ఒంటరి క్రైస్తవులకు ఇది సహాయపడుతుంది. ఆది సంఘంలో సహవాసంలో జవాబుదారీతనం ఉండేది. 'వీరు థెస్సలొనీకలో ఉన్న వారికంటె ఘనులైయుండిరి గనుక ఆసక్తితో వాక్యమును అంగీకరించి, పౌలును సీలయును చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతిదినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి' (అపొ. కార్యములు 17:11). అపొ. కార్యములు 2వ అధ్యాయంలో ఆదిమ క్రైస్తవులు అలా కూడుకోవడం మొదట దృశ్య భాగంలో చూస్తాం. 'వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి' (అపొ. కార్యములు 2:42). మెథడిస్ట్ (Methodist) ఉద్యమ సంస్థాపకుడు అయిన John Wesley ఒకసారి ఈ విధంగా చెప్పెను 'ఒకరితో ఒకరు సహవాసం లేని ఒంటరి అయిన మతం అనేదే లేదు'. దైవిక స్వభావంలో ఎదగడానికి , వ్యక్తిగత ప్రార్థన, దేవుని వాక్య ధ్యానంతో పాటు, ఇతర క్రైస్తవులతో సహవాసం కలిగి వుండటం కూడా ముఖ్యమైనది. మనందరం ఒకరికి ఒకరు అవసరం .

మంచి పుస్తకాలను చదవడం కూడా మనకు ఎంతో ప్రయోజనకరం. ఇతర క్రైస్తవుల జీవిత చరిత్రలు (ముఖ్యంగా గతకాల క్రైస్తవులు) చదవడం క్రైస్తవ జీవితాన్ని నేర్చుకోవడానికి చాలా శ్రేష్టమైన మార్గం, ముఖ్యంగా దైవిక స్వభావంలో ఎదగడానికి.

**ముగింపు:**

క్రైస్తవ నాయకత్వంలో యోగ్యతకంటే ముందు స్వభావానికి మొదట స్థానం ఉంది. నేను వ్రాసిన ప్రకారం, UK సాధారణ ఎన్నికలకు మూడు వారాల దూరంలో వుంది. ప్రచార మాధ్యమాలు ముఖ్యంగా రాజకీయ నేతల యొక్క కపటత్వం గురించి భయతపెట్టే ప్రయత్నం చేస్తుంది. రాజకీయ నేతలు వారి స్వభావం కాని దానికి వారిదిగా నటించడం సామాన్య జనులు కూడా ఇష్టపడరు. 2010 లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో అప్పటి ప్రధానమంత్రి అయిన Gordon Brown ప్రచారంలో పాల్గొన్నప్పుడు ఒక పాఠాన్ని నేర్చుకున్నాము. దురదృష్టవశాత్తూ, ఆయన పొరపాటున తన మైక్రోఫోన్ ఆన్ లోనే ఉండటం గమనించక ఒక ఆమెను 'దురభిమాని' అని పిలవడం జరిగింది. క్రైస్తవ సంఘ నాయకుడైన John Stevens తన బ్లాగ్ లో ఈ విధంగా వ్రాసెను 'ప్రధాన మంత్రికి సామాన్య ప్రజలపై నిజమైన అభిప్రాయం అకస్మాత్తుగా బయటపడింది. రాజకీయ నాయకుల వ్యక్తిగత జీవితాలు కూడా ముఖ్యమైనవే. ఎందుకంటే అవి వారి స్వభావాన్ని, సాంప్రదాయుల్ని మరియు వారి వ్యక్తిగత విలువలను వెల్లడిపరుస్తాయి. వారు సాధారణ ప్రజలను అర్థం చేసుకుంటాం లేక వారి అవసరతలను పట్టించుకుంటాం' అని చెప్పే మాటలను వారి స్వభావం ద్వారా నిజమో కాదో రుజువు చేస్తాయి.

ఇదే విషయం క్రైస్తవ నాయకులకు కూడా వర్తిస్తుంది. ఇది కేవలం సరైన నమ్మకాలు కలిగి వుండటం లేక వారి బాధ్యతలు సరిగ్గా నిర్వర్తించడం గురించి మాత్రమే కాదు. అది నీ వ్యక్తిగత జీవితంలో నీవు ఎలా వున్నావు అనే దానిని బట్టి కూడా. 1 తిమోతి 3:1-7 మరియు తీతుకు 1:5-9 లు, మంచిపేరు, స్వభావం మరియు కుటుంబ జీవితం కూడా నాయకత్వంలోని భాగాలేనని మనకు గుర్తుచేస్తుంది. నీ వ్యక్తిగత మరియు బాహ్య జీవితాలు విడివిడి కాదని పరిశుద్ధ గ్రంధం భోదిస్తుంది. దైవిక స్వభావం, నీ వ్యక్తిగత మరియు బాహ్య జీవితాలలో కూడా నాటబడి వుండాలి. అందరి బాహ్య ప్రపంచానికి మన జీవితాన్ని అసత్య కోణంలో చూపించి, వ్యక్తిగత జీవితంలో ఇంకోలా జీవించడం చేయకూడదు. మతసంభంధమైన కపటత్వంలో ఉన్న పరిసయ్యుల యెడల యేసు కఠినమైన మాటలు తరుచు పలికెను.

అందరికి కనిపించేలా ప్రతీ క్రైస్తవుడు తన జీవితాన్ని యదార్ధంగా, నిజాయితీగా జీవించాలి. క్రైస్తవ నాయకత్వంలో ఉన్న వారికి ఇది మరి ఎక్కువగా వర్తిస్తుంది. థెస్సలొనీయ విశ్వాసులకు పౌలు, తాను మరియు ఇతర క్రైస్తవులు వారి జీవితాలను దైవిక స్వభావంలో ఏ విధంగా నిలకడగా జీవించారో గుర్తుచేసెను. 'మీరు మాకు బహు ప్రియులైయుంటిరి గనుక మీయందు విశేషా పేక్ష గలవారమై దేవుని సువార్తను మాత్రము గాక మా ప్రాణములనుకూడ మీకిచ్చుటకు సిద్ధపడియుంటిమి' (1 థెస్సలొనీకయులకు 2:8).

యేసే మన అత్యుత్తమ మార్గదర్శకుడు, నిరంతరం శోధింపబడినప్పటికి, పాపం లేని వాడు (హెబ్రీయులకు 2:18, 2 కొరింథీయులకు 5:21). తుదకు యేసు క్రీస్తువలె మారడం 'దైవిక స్వభావం' యొక్క ముఖ్య ఉద్దేశ్యం. దేవుడు నిన్ను ఎన్నడూ విడిచి పెట్టడు, ఎందుకంటే 'మీలో ఈ సత్క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినము వరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను' (ఫిలిప్పీయులకు 1:4). పరిశుద్ధ గ్రంథంలో మన కొరకు ఇవ్వబడిన ఉన్నతమైన సలహా, ఈ 'దైవిక స్వభావం' యొక్క ముగింపుగా ఏమి ఇవ్వబడిందంటే 'విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము.' (హెబ్రీయులకు 12:2)